

TG/TEL/25/A3731

నిజం
దృష్టి తెలుగు న్యూస్



రిపోర్టర్లు కావలెను

నిజం దృష్టి తెలుగు న్యూస్

దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సెల్: 9247842354

హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-328 | పేజీలు:-4 | శుక్రవారం 20-11-2026

Hydrabab | Editer name : varudu sujatha | volume:01, | issue:328 | pages:04 | Friday - 20-11-2026

తెలంగాణ అభివృద్ధికి
కేంద్రం సహకరించాలి

- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ
- రాష్ట్రంలో మూడు జోన్లుగా అభివృద్ధి ప్రణాళికలు
- నగరాలు, గ్రామాలు, పారిశ్రామిక కారిడార్లకు రోడ్డు అనుసంధానం
- రూ.వేల కోట్లతో 8 వేల పడకల ఆస్పత్రుల నిర్మాణం
- 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి



సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

హైదరాబాద్ హైటెక్స్‌లో 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ వార్షిక సదస్సును ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తో కలిసి ప్రారంభించారు. ఈ సదస్సులో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , పొన్నం ప్రభాకర్ , ఎంపీలు ఈటల రాజేందర్ , డీకే అరుణ , రఘునందన్ రావు తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దేశ భద్రత, జాతీయ ప్రాధాన్యతలు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సంక్షేమం వంటి విషయాల్లో రాజకీయాలకు తావు లేకుండా ఐక్యంగా పనిచేయాలని అన్నారు. రాజకీయాలను ఎన్నికల వరకే పరిమితం చేసి మిగిలిన సమయం దేశాభివృద్ధిపై దృష్టి సారించాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. తెలంగాణలో చేపట్టాల్సిన రోడ్ నెట్‌వర్క్‌కు సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే అనేక సందర్భాల్లో అందించామని గుర్తుచేస్తూ వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని నితిన్ గడ్కరీ గారికి విజ్ఞప్తి చేశారు. “వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రం సైతం స్పష్టమైన విధానాలతో ముందుకు వెళుతోంది. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణ తనవంతుగా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని సంకల్పంతో ముందుకు వెళుతున్నాం. కేంద్రం కూడా తనవంతుగా రాష్ట్రానికి సహకారం అందించాలి. అందుకోసం తెలంగాణను మూడు

విద్యాసాగర్ మృతి పట్ల కేసీఆర్ సంతాపం

- తెలంగాణ మలి దశ ఉద్యమకారుడు అచ్చా విద్యాసాగర్ కన్నుమూత
- హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- తెలంగాణ ఒక నిఖార్సయిన ఉద్యమకారున్ని కోల్పోయిందంటూ కేసీఆర్ ఆవేదన



మలి దశ తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు అచ్చా విద్యాసాగర్ కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన

- మిగతా 2 లో

సాగు బాగుంటేనే సుభిక్ష తెలంగాణ!

- ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యం: సీఎం రేవంత్ రెడ్డి
- వ్యవసాయ రంగ ప్రముఖులకు ‘ఇందిరా గాంధీ కృషి రత్న’ పురస్కారాలు
- శాస్త్రవేత్తలు, పాత్రికేయుడు, రైతులకు అవార్డుల ప్రదానం
- వ్యవసాయాభివృద్ధిలో ఇందిరాగాంధీ సేవలపై రూపొందించిన పుస్తకావిష్కరణ



టాక్స్ తగ్గించాం మరి జీతాలు పెంచారా?

- భారత పారిశ్రామికవేత్తలకు ప్రధాని మోదీ సూటి ప్రశ్న!
- ఫిక్కీ సదస్సులో పారిశ్రామిక దిగ్గజాలను ప్రశ్నించిన ప్రధాని మోదీ
- సంస్కరణల ద్వారా ఎన్ని ఉద్యోగాలు సృష్టించారో చూపాలని సూచన
- ఉద్యోగుల వేతనాలను ఎంత పెంచారో పరిశ్రమలు నిరూపించుకోవాలని వెల్లడి
- దేశీయ వినియోగదారులకు అంతర్జాతీయ స్థాయి నాణ్యత ఇవ్వాలని ఆదేశం
- ఫార్మా ఏపీఐలు, స్టీల్ దిగుమతులపై ఆధారపడటం తగ్గించాలని పిలుపు



కార్పొరేట్ పన్నుల తగ్గింపు, పలు ఆర్థిక సంస్కరణలతో ప్రభుత్వం ఇచ్చిన రాయితీలతో పరిశ్రమలు ఎంతమందికి కొత్తగా ఉపాధి కల్పించాయి? ఉద్యోగుల వేతనాలను ఎంతమేర పెంచాయి? అంటూ భారత పారిశ్రామిక రంగాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సూటిగా ప్రశ్నించారు. న్యూఢిల్లీలో గురువారం జరిగిన ఫిక్కీ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపారాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పన్నుల తగ్గింపు, నిబంధనల సరళీకరణ, అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల వంటి ఎన్నో చర్యలు తీసుకుందని ప్రధాని గుర్తుచేశారు. ఆ ఫలాలను ఉద్యోగాల సృష్టి, మెరుగైన వేతనాల రూపంలో ప్రజలకు అందించాల్సిన బాధ్యత పరిశ్రమలపైనే ఉందని స్పష్టం చేశారు. దేశ సర్వతోముఖాభివృద్ధి కేవలం ప్రభుత్వంతోనే సాధ్యం కాదని, పారిశ్రామికవేత్తలు సైతం ఈ ప్రగతి ప్రయాణంలో సమాన భాగస్వాములు కావాలని మోదీ

మొదటి భర్త కుటుంబ ఆస్తిలో రెండో వివాహం పిల్లలకు వాటా



- రెండో పెళ్లి ద్వారా జన్మించిన పిల్లలకూ తల్లి పేరిట ఉన్న ఆస్తిలో వారసత్వ హక్కు ఉంటుంది: సుప్రీంకోర్టు
- మహిళకు సంపూర్ణ యాజమాన్య హక్కులుంటే ఆమె వారసులకే ఆస్తి దక్కుతుందని స్పష్టత
- హిందూ వారసత్వ చట్టం సెక్షన్ 14(1) ప్రకారం పరిమిత హక్కులు సంపూర్ణంగా మారుతాయని వెల్లడి

మొదటి భర్త కుటుంబం ద్వారా సంక్రమించిన ఆస్తిపై హిందూ మహిళకు సంపూర్ణ యాజమాన్య హక్కులు లభిస్తే, - మిగతా 2 లో

బంగ్లాదేశ్‌లో చెలరేగిన హింస.. మహమ్మద్ యూనస్ ఇంటికి నిప్పు



- అవామీ లీగ్ బంద్ పిలుపుతో బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తత
- ఢాకాలో పలుచోట్ల బాంబు పేలుళ్లు.. 565 మంది అరెస్ట్
- అవామీ లీగ్‌ను ఉగ్రవాద సంస్థగా అభివర్ణించిన బంగ్లా ప్రధాని

నిషేధిత అవామీ లీగ్ పార్టీ (షేక్ హసీనా పార్టీ) దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో తీవ్ర హింస చెలరేగింది. పలు ప్రాంతాల్లో - మిగతా 2 లో

శబరిమల యాత్రకు వచ్చే ఏపీ, తెలంగాణ భక్తులకు కేరళ ప్రభుత్వం, ఆలయ బోర్డు కీలక విన్నపం



- పంబా నదిలో వస్త్రాలు వదలొద్దని కేరళ ప్రభుత్వం, ట్రావెన్‌కోర్ బోర్డు విన్నపం
- వస్త్రాలు వదిలేయడం వల్ల తీవ్ర కాలుష్యం ఏర్పడుతోందని ఆందోళన
- ఈ విషయంలో భక్తులను చైతన్యపరచాలని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు లేఖ

శబరిమల యాత్రకు వెళ్లే ఆంధ్రప్రదేశ్,

మూడు ప్రాంతాల ప్రణాళికలే రాష్ట్రాభివృద్ధికి బ్లూప్రింట్

- విశాఖ, అమరావతి, తిరుపతి రీజియన్లపై సీఎం చంద్రబాబు సమీక్ష
- సైబరాబాద్ తరహాలో విశాఖ బే-టెక్ సిటీ అభివృద్ధి
- గ్లోబల్ సెమీకండక్టర్ డిజైన్ క్యాపిటల్‌గా తిరుపతి
- క్వాంటం టెక్నాలజీ కేంద్రంగా అమరావతి రాజధాని
- సూర్యలంక, గండికోట ప్రాంతాలకు టూరిజం మాస్టర్ ప్లాన్



ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం రూపొందించిన విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ఆర్థిక ప్రాంతాల (ఎకనామిక్ రీజియన్స్) ప్రణాళికలే రాష్ట్రాభివృద్ధికి అసలైన బ్లూప్రింట్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. క్యాంప్ కార్యాలయంలో ఈ మూడు ఆర్థిక ప్రాంతాల అభివృద్ధి బ్లూప్రింట్లపై సీఎం ఉన్నతస్థాయి - మిగతా 2 లో

TG/TEL/25/A3731
నిజం
దృష్టి తెలుగు న్యూస్
శుక్రవారం 20-11-2026

మొదటిపేజీ తరువాయి

ప్రజల సొమ్ముతో ఢిల్లీ నేతల జల్సా!

మొదటిపేజీ తరువాయి - చేశారన్న ఆరోపణలు ఇంకా ప్రజల మదిలో మరువలేదు.

తెలంగాణకు వచ్చిన పెట్టుబడి ఎంత? వచ్చిన ఉద్యోగాలు ఎన్ని? ప్రభుత్వం ఇప్పటివరకు లెక్క చెప్పలేదు. కానీ ఖర్చు మాత్రం కోట్లలోనే. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక, కేరళ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలే ఈ సమ్మిట్‌కు ఆసక్తి చూపించలేదు. సొంత పార్టీ రాష్ట్రాలే దూరంగా ఉన్న సమ్మిట్‌ను తెలంగాణ ప్రజల డబ్బుతో ఎందుకు నిర్వహిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాహుల్ గాంధీ మెప్పు కోసమే రేవంత్ రెడ్డి మళ్లీ భారత్ సమ్మిట్ నిర్వహణకు అత్యుత్సాహం చూపుతున్నారన్న విమర్శలు రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి.

ఎల్‌నినోతో ప్రజలు గాలికి.. మంత్రులు జల్సాలో!

ఒకవైపు ఎల్‌నినో పరిస్థితులతో రైతులు, ప్రజలు అల్లాడుతున్నారు. పంటలు ఎండిపోతున్నాయని, తాగునీటి ఇబ్బందులు వస్తున్నాయని గ్రామాల్లో ఆందోళన నెలకొంది. అలాంటి సమయంలో ప్రజలను గాలికి వదిలేసి మంత్రులు భారత్ సమ్మిట్ ఏర్పాట్లలో మునిగిపోవడం దారుణమని విపక్షాలు మండిపడుతున్నాయి. ఇదే భారత్ సమ్మిట్ ద్వారా గ్లోబల్ సమ్మిట్ ప్రచారం చేస్తామంటూ గారడీ చేస్తున్నారని, నిజానికి ఇది తెలంగాణ అభివృద్ధి కోసం కాదు.. ఢిల్లీ పెద్దల మెప్పు కోసమేనని ఆరోపిస్తున్నారు.

ప్రజలు అడుగుతున్న ప్రశ్న:

ఈ రూ.50 కోట్లు ప్రజల కోసమా? లేక ఢిల్లీ నేతల రాజభోగాల కోసమా? ఈ డబ్బుతో ఎన్ని గ్రామాల్లో తాగునీరు ఇవ్వొచ్చు? ఎంతమంది రైతులకు చేయూత ఇవ్వొచ్చు? ఎన్ని పాఠశాలలు బాగుచేయొచ్చు? ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

దీపావళికి టపాసులు కాలిస్తే తప్పేంటి?

మొదటిపేజీ తరువాయి - ఒక్క రోజు పండుగను ఆనందంగా జరుపుకొంటే కాలుష్యం పేరుతో అభ్యంతరాలు వ్యక్తం చేయడం ఏంటని ప్రశ్నించారు. కాలుష్యం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అది కొంతకాలానికి తగ్గిపోతుందని వ్యాఖ్యానించారు. ధనత్రయోదశి, దీపావళి సందర్భంగా ప్రజలు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చడం సంతోషంగా ఉందని యోగి అన్నారు. అయోధ్యలో తాను కూడా దీపావళి వేడుకల్లో పాల్గొని బాణసంచా కాల్చినట్లు గుర్తుచేశారు. తమ ప్రభుత్వం పండుగలపై ఆంక్షలు విధించడాన్ని ప్రోత్సహించలేదని, ప్రజలు స్వేచ్ఛగా వేడుకలు జరుపుకోవాలని కోరుకుంటోందని చెప్పారు. వ్యవస్థ మొత్తాన్ని అవినీతి పనులతో కలుషితం చేసేవారిని ఎవరూ ప్రశ్నించరని, ప్రజలు ఒక్కరోజు టపాసులు కాల్చి సంబరాలు చేసుకుంటే మాత్రం వెంటనే కాలుష్యం అంశాన్ని తెరపైకి తెస్తున్నారని విమర్శించారు. ఇతరులు పండుగలు జరుపుకొంటూ ఆనందంగా ఉన్నప్పుడే కొందరికి కాలుష్యం గుర్తుకొస్తోందని వ్యాఖ్యానించారు. దీపావళికి ముందు దేశంలోని పలు నగరాల్లో గాలి నాణ్యత క్షీణించింది. ముఖ్యంగా ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. నవంబర్ 9న ఢిల్లీలో గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 371గా నమోదైంది. 2021 తర్వాత ఇదే అత్యంత అధ్వాన స్థాయి. పలు పర్యవేక్షణ కేంద్రాల్లో ఏక్యూఐ 400 దాటడంతో గాలి నాణ్యత తీవ్ర కేటగిరీలోకి వెళ్లింది. ప్రస్తుతం పరిస్థితి కొంత మెరుగుపడి 'పూర్' స్థాయికి చేరింది.

మూడు ప్రాంతాల ప్రణాళికలే రాష్ట్రాభివృద్ధికి బ్లూప్రింట్

సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు గుర్తించిన పెట్టుబడులను క్షేత్రస్థాయిలో వాస్తవరూపంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కేవలం పరిశ్రమల రాక, పెట్టుబడుల ఆకర్షణ మాత్రమే అభివృద్ధి కాదని, వాటి ద్వారా ప్రజల ఆదాయాలు పెరిగి జీవన ప్రమాణాలు మెరుగుపడటమే అసలైన పురోగతి అని ఆయన పేర్కొన్నారు. తలసరి ఆదాయాన్ని పెంచేలా అధికార యంత్రాంగం పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు.

సైబరాబాద్ తరహాలో విశాఖ బే-టెక్ సిటీ

విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలో యాంకర్ ప్రాజెక్టుగా చేపడుతున్న ప్రాంతానికి 'విశాఖ బే-టెక్ సిటీ'గా నామకరణం చేశారు. గతంలో హైదరాబాద్‌లో సైబరాబాద్‌ను నిర్మించిన విధంగానే, విశాఖకు అనుబంధంగా అంతర్జాతీయ ప్రమాణాలతో బే-టెక్ సిటీని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నగర మేయర్‌కు వీఈఆర్ స్టీరింగ్ కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాలని సూచించారు. ఈ రీజియన్‌లో 167 ప్రాజెక్టులకు గానూ ఇప్పటికే 64 ప్రాజెక్టులు అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. విజయనగరం, అనకాపల్లి వైపు వేగంగా విస్తరిస్తున్న దృష్ట్యా ముందస్తుగానే ల్యాండ్ బ్యాంక్ సిద్ధం చేయాలని చెప్పారు. భూ లభ్యత తక్కువగా ఉన్న ఉమ్మడి గోదావరి, కృష్ణా జిల్లాల్లో పారిశ్రామిక అవసరాల కోసం ఏపీఐఐసీ సమన్వయంతో ప్రత్యేక ల్యాండ్ పాలసీ తీసుకురావాలని ఆదేశించారు. ఏడాదిలోగా విశాఖలో కన్వెన్షన్ సెంటర్ పూర్తి చేసి, తదుపరి సీఐఐ భాగస్వామ్య సదస్సును అక్కడే నిర్వహించాలని నిర్దేశించారు.

సెమీకండక్టర్ల డిజైన్ క్యాపిటల్‌గా తిరుపతి

తిరుపతి ఆర్థిక ప్రాంతాన్ని గ్లోబల్ సెమీకండక్టర్ డిజైన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఎలక్ట్రానిక్స్, స్పేస్, రోబోటిక్స్, డ్రోన్ల రంగాలకు అవసరమైన ఆర్ అండ్ డీ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. కొప్పర్తి, తిరుపతి, లేపాక్షి క్లస్టర్లను బలోపేతం చేయడంతో పాటు ఈ రీజియన్‌లోని 16 పట్టణాలను పారిశ్రామిక నగరాలుగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. తిరుపతి ప్రాంతానికి ఇప్పటికే రూ.9 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా, అందులో రూ.5.70 లక్షల కోట్లు కేవలం గ్రీన్ ఎనర్జీ రంగంలోనే నమోదయ్యాయని వివరించారు. రేర్ ఎర్త్ మినరల్స్ వినియోగానికి సంబంధించి ప్రత్యేక మాగ్నెటిక్ క్లస్టర్, మూడేళ్ల లక్ష్యంతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

క్వాంటం హబ్‌గా అమరావతి

అమరావతి ప్రాంతంలో ఆక్వా, కోకో, పామాయిల్ రంగాలు ప్రధాన ఆర్థిక చోదక శక్తులుగా ఉన్నాయని, ప్రస్తుతం రూ.4.65 లక్షల కోట్ల విలువైన 48 ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. అమరావతిని భవిష్యత్ 'క్వాంటం కారిడార్'గా, క్వాంటం వ్యాలీ, క్వాంటం మాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల అనుసంధానంతో పాటు అమరావతి ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణం ఈ ప్రాంత పురోగతికి కీలకంగా మారుతాయని పేర్కొన్నారు.

ఎంఎస్ఎంఈల అనుసంధానం - నాలెడ్జ్ పార్టనర్లు

భారీ పరిశ్రమలకు అవసరమైన విడిభాగాలు, సేవలు అందించేలా ఎంఎస్ఎంఈలను పెద్ద పరిశ్రమలతో అనుసంధానించాలని సీఎం స్పష్టం చేశారు. ప్రతి పారిశ్రామిక క్లస్టర్ వద్ద విద్య, వైద్యం, నివాస సదుపాయాలతో కూడిన పూర్తి ఎకోసిస్టమ్‌ను నిర్మించాలని సూచించారు. పరిశ్రమల వ్యర్థాల నుంచి విలువైన పదార్థాలను రీసైక్లింగ్ చేసే నూతన సాంకేతికతలపై దృష్టి పెట్టాలన్నారు. మూడు ఆర్థిక ప్రాంతాలకు ఐఐటీ తిరుపతి, బిట్స్ పిలానీ వంటి ప్రముఖ విద్యాసంస్థలను నాలెడ్జ్ పార్టనర్లుగా నియమించుకోవాలని, పాన్-ఐఐటీ నిపుణుల సేవలను అందిపుచ్చుకోవాలని చెప్పారు.

పర్యాటకానికి మాస్టర్ ప్లాన్

రాష్ట్రంలో పర్యాటకాన్ని లాభదాయక ఆర్థిక వనరుగా మార్చాలని సీఎం పిలుపునిచ్చారు. అరకు, లంబసింగి ప్రాంతాలకు రహదారులు, మౌలిక వసతులు మెరుగుపరచాలని, సీఐఐ సదస్సు ప్రతినిధులను అక్కడికి తీసుకెళ్లేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సూర్యలంక, గండికోట పర్యాటక ప్రాంతాలకు సమగ్ర మాస్టర్ ప్లాన్లు రూపొందించాలని, సూర్యలంకను వెంటనే నోటిఫై చేయాలని ఆదేశించారు. ఓడరేవు, చినగంజాం, నిజాంపట్నం, దిండి తీర ప్రాంతాలను పర్యావరణహిత బీచ్ రిసార్టులుగా తీర్చిదిద్దాలన్నారు. అమరావతి-నాగార్జునకొండలను అనుసంధానిస్తూ బౌద్ధ సర్క్యూట్, శ్రీశైలం తదితర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలని నిర్దేశించారు. కేంద్ర ప్రభుత్వ సిటీ ఎకనమిక్ రీజియన్ స్కీం కింద ప్రతిపాదించిన రూ.9,180 కోట్ల విలువైన 60 ప్రాజెక్టులను వేగంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షలో విశాఖ, తిరుపతి, అమరావతి ఎకనమిక్ రీజియన్ల సీఈఓలు యువరాజ్, ముఖేష్ కుమార్ మీనా, సురేష్ కుమార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

శబరిమల యాత్రకు వచ్చే ఏపీ, తెలంగాణ భక్తులకు కేరళ ప్రభుత్వం, ఆలయ బోర్డు కీలక విన్నపం

మొదటిపేజీ తరువాయి - తెలంగాణ రాష్ట్రాల అయ్యప్ప భక్తులకు కేరళ ప్రభుత్వం, ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) కీలక విజ్ఞప్తి చేశాయి. పవిత్రమైన పంబా నదిలో స్నానమాచరించిన అనంతరం భక్తులు తమ దుస్తులను నదిలోనే వదిలివేయవద్దని కోరాయి. ఈ విషయమై భక్తులలో విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరుతూ ఏపీ, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు (సీఎస్) బోర్డు అధికారికంగా లేఖలు రాసింది. వార్షిక మండల-మకరవిళక్కు యాత్ర ప్రారంభమైన నేపథ్యంలో, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. పంబా నదిలో స్నానం చేసిన తర్వాత భక్తులు తాము ధరించిన సంప్రదాయ దుస్తులను నదిలోనే విడిచిపెడుతుండటంతో తీవ్రమైన నదీ కాలుష్యం ఏర్పడుతోందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. "పంబా నదిలో దుస్తులు వదిలేయాలనే నిబంధన ఏ శాస్త్రంలోనూ, అయ్యప్ప పూజా విధానంలోనూ లేదు" అని దేవస్థానం బోర్డు స్పష్టం చేసింది. కొందరు గురుస్వాములు చెప్పే మాటలు విని భక్తులు ఇలా చేస్తున్నారని, దీనివల్ల పవిత్రమైన నదిలో వైరస్‌లు వ్యాపించి నీరు కలుషితమవుతోందని బోర్డు ప్రతినిధులు పేర్కొన్నారు. భక్తులు విడిచిపెట్టే దుస్తులు వందల ట్రక్కుల కొద్దీ పేరుకుపోతున్నాయని, వాటిని తొలగించడం పారిశుద్ధ్య సిబ్బందికి పెను భారంగా మారుతోందని వివరించారు. ఈ ఏడాది శబరిమల యాత్రను 'క్లీన్ శబరిమల, పవిత్ర శబరిమల' అనే నినాదంతో నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పంబా నది పవిత్రతను, పర్యావరణాన్ని కాపాడేందుకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తమ ప్రచార మాధ్యమాల ద్వారా భక్తులకు అవగాహన కల్పించి సహకరించాలని కోరారు.

తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలి





మొదటిపేజీ తరువాయి - జోన్లుగా విభజన చేసి లక్ష్యాలను నిర్దేశించాం. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి భాగాన్ని సర్వీస్ సెక్టార్‌గా, ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు మధ్య భాగం తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నాం. రీజినల్ రింగ్ రోడ్డు నుంచి రాష్ట్ర సరిహద్దు ప్రాంతం వరకు వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రాధాన్యమిస్తున్నాం. ఆయా రంగాలు అభివృద్ధి సాధించడానికి రవాణా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. అందుకు పటిష్టమైన రోడ్ నెట్‌వర్క్ ఉండాలి. ప్రధానంగా నగరాలు, గ్రామాలతో పాటు పారిశ్రామిక కారిడార్లను అనుసంధానం చేస్తూ రోడ్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయడం ద్వారా కనెక్టివిటీ, మొబిలిటీ పెరుగుతాయి. తద్వారా వ్యాపార, వాణిజ్య రంగాలు వృద్ధి సాధిస్తాయి. మౌలిక సదుపాయాల కల్పనలో రోడ్లు మాత్రమే కాకుండా హెల్త్‌కేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విషయంలో కూడా తెలంగాణ ఎన్నో కీలకమైన చర్యలు చేపట్టింది. హెల్త్ కేర్ ప్రాధాన్యత దృష్ట్యా పురాతన ఉస్మానియా జనరల్ ఆస్పత్రిని అత్యంత అధునాతన వసతులతో నిర్మిస్తున్నాం. అలాగే రాష్ట్రంలోని టిమ్స్ ఆస్పత్రులు, వరంగల్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితో పాటు మొత్తంగా 8 వేల పడకల సామర్థ్యంతో ఆస్పత్రులను నిర్మిస్తున్నాం" అని ముఖ్యమంత్రి గారు వివరించారు. 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్‌కు హైదరాబాద్ వేదిక కావడం గర్వకారణంగా ఉందని చెప్పారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో భాగస్వాములు కావాలని సదస్సుకు హాజరైన ప్రతినిధులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు ఆహ్వానం పలికారు. ఈ సదస్సులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గారు, ఐఆర్‌సీ అధ్యక్షుడు లక్ష్మి కాంత పది గారు, ఇతర కార్యవర్గ సభ్యులు, కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధికారులు, ఆయా సంస్థలకు చెందిన నిపుణులు హాజరయ్యారు.

విద్యాసాగర్ మృతి పట్ల కేసీఆర్ సంతాపం



మొదటిపేజీ తరువాయి - హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నిన్న సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్త తెలుసుకున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యాసాగర్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ నాటి టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ సమయం నుంచి విద్యాసాగర్‌తో తనకు ఉన్న ఉద్యమ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. "వరంగల్ కేంద్రంగా సాగిన తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన విద్యాసాగర్ మరణంతో తెలంగాణ ఒక నిఖార్సయిన ఉద్యమకారున్ని కోల్పోయింది" అని కేసీఆర్ పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం వరంగల్ వేదికగా సాగిన పోరాటాల్లో, ముఖ్యంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఉద్యమాన్ని ముందుండి నడిపించడంలో ఆయన పోషించిన పాత్ర ఎనలేనిదని గుర్తుచేశారు.అచ్చా విద్యాసాగర్ మృతి పట్ల మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కూడా తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమానికి, పార్టీకి విద్యాసాగర్ అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. ఆయన మరణం పార్టీకి, ఉద్యమకారులకు తీరని లోటని పేర్కొంటూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉద్యమ కాలం నుంచి నిబద్ధతతో పనిచేసిన సీనియర్ నేత విద్యాసాగర్ మృతితో బీఆర్ఎస్ శ్రేణుల్లో తీవ్ర విషాదం నెలకొంది.

సాగు బాగుంటేనే సుభిక్ష తెలంగాణ!

మొదటిపేజీ తరువాయి - సాగు బాగుంటేనే సుభిక్షమైన తెలంగాణ సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనేదే తమ లక్ష్యమని చెప్పారు. వ్యవసాయ రంగంలో బహుముఖ సేవలు అందించిన ప్రముఖులకు 'ఇందిరా గాంధీ కృషి రత్న' పురస్కారాలను ముఖ్యమంత్రి తన నివాసంలో అందజేశారు. వ్యవసాయ రంగానికి సేవలు అందించిన శాస్త్రవేత్తలు, పాత్రికేయులు, రైతులను తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఈ అవార్డులకు ఎంపిక చేసింది. అవార్డులకు ఎంపికైన డాక్టర్ ఎం.సుగుణాకర్ రెడ్డి, డాక్టర్ ఎస్.డి.శిఖామణి (వ్యవసాయ శాస్త్రవేత్తలు), ఆర్. దిలీప్ రెడ్డి (పాత్రికేయుడు), లోనావత్ శాంతా బాయి (గిరిజన రైతు),ఎ

కె.లావణ్య (సేంద్రియ రైతు) ఇందిరా గాంధీ కృషి రత్న పురస్కారాలను ముఖ్యమంత్రి చేతులమీదుగా అందుకున్నారు. ప్రధానమంత్రిగా ఇందిరా గాంధీ వ్యవసాయభివృద్ధికి అందించిన చేయూత, ఆ కాలంలో సాగు రంగంలో చోటు చేసుకున్న అభివృద్ధిపై తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ రూపొందించిన పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ , రాష్ట్ర రైతు కమిషన్ ఛైర్మన్ ఎం. కోదండ రెడ్డి , కమిషన్ సభ్యులు కె.వి.ఎన్. రెడ్డి , ఎం. భవాని రెడ్డి తో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో చెలరేగిన హింస.. మహమ్మద్ యూనస్ ఇంటికి నిప్పు

మొదటిపేజీ తరువాయి - చోటుచేసుకున్న ఘర్షణల్లో నలుగురు ప్రాణాలు కోల్పోగా, రాజధాని ఢాకాలో వరుసగా బాంబు పేలుళ్లు కలకలం రేపాయి. ఇదే సమయంలో చట్టోగ్రామ్‌లోని మాజీ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ పూర్వీకుల ఇంటికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. అలాగే పలు ప్రాంతాల్లోని గ్రామీణ్ బ్యాంక్ శాఖలపై కూడా దాడులు జరిగాయి. పశ్చిమ నరైల్ జిల్లాలో అవామీ లీగ్ శ్రేణులు జరిపిన దాడిలో అధికార బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ)కి చెందిన ఇద్దరు స్థానిక నేతలు మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. దేశంలోని దాదాపు 28 జిల్లాల్లో డజన్ల కొద్దీ నాటు బాంబుల పేలుళ్లు, వాహనాల దహనం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ హింసాత్మక పరిణామాల నేపథ్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. రాజధాని ఢాకాలో గత 24 గంటల్లో మాజీ విద్యాశాఖ మంత్రి నూరుల్ ఇస్లాం నహీద్‌తో సహా మొత్తం 565 మందిని అదుపులోకి తీసుకున్నారు. అల్లర్లకు పాల్పడిన వారిపై ఆడియో, వీడియో ఆధారాలను పరిశీలించి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హోం మంత్రి సలాహుద్దీన్ అహ్మద్ స్పష్టం చేశారు. మరోవైపు పార్లమెంటులో ప్రసంగించిన ప్రధాని రెహమాన్.. అవామీ లీగ్‌ను ఒక ఉగ్రవాద సంస్థగా అభివర్ణించారు. దేశంలో ఫాసిస్టు శక్తులు మళ్లీ పుంజుకోకుండా ప్రజాస్వామ్య శక్తులన్నీ ఏకతాటిపైకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. 2024 నాటి విద్యార్థుల ఉద్యమంపై అణచివేత కేసులో మాజీ ప్రధాని షేక్ హసీనాకు ప్రత్యేక ట్రైబ్యునల్ మరణశిక్ష విధించి ఏడాది పూర్తయిన సందర్భంగా అవామీ లీగ్ ఈ బంద్ చేపట్టింది. ప్రస్తుతం భారత్‌లో ఉన్న హసీనాను అప్పగించాలని బంగ్లాదేశ్ కోరుతుండగా, తాజా ఆందోళనలతో ఆ దేశంలో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయి.



టాక్స్ తగ్గించాం.. మరి జీతాలు పెంచారా?



మొదటిపేజీ తరువాయి - పిలుపునిచ్చారు. భారత్ కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ప్రయోజనాలను అందిపుచ్చుకోవడానికి సంస్థలే సొంతంగా నిర్దిష్ట వ్యూహాలను రూపొందించుకోవాలని సూచించారు. ప్రతిదానికీ ప్రభుత్వంపైనే ఆధారపడవద్దని హితవు పలికారు. విదేశాలకు ఎగుమతి చేసే ఉత్పత్తులకే అత్యున్నత నాణ్యతను కేటాయిస్తూ 'ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ' పేరిట ప్రచారం చేయడంపై మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విదేశీ వినియోగదారులకు అందించే నాణ్యమైన వస్తువులనే భారతీయ పౌరులు కూడా పొందే హక్కు కలిగి ఉన్నారని స్పష్టం చేశారు. దేశీయ మార్కెట్‌ను తేలిగ్గా తీసుకోవద్దని హితవు పలికారు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ తయారీ రంగాన్ని బలోపేతం చేయాలని ప్రధాని కోరారు. ప్రపంచానికే ఫార్మసీ హబ్ గా పేరుగాంచిన భారత్.. కీలకమైన యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియంట్స్ (ఏపీఐ), ముడి పదార్థాల కోసం ఇతర దేశాలపై బిలియన్ల డాలర్లు వెచ్చించాల్సి రావడంపై ఆందోళన వ్యక్తం చేశారు. సమృద్ధిగా ముడి వనరులు ఉన్నప్పటికీ అల్యూమినియం, స్టీల్ రంగాల్లో ప్రత్యేక ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం తగదన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల్లో అగ్రగామిగా ఉన్నప్పటికీ అంతర్జాతీయ మార్కెట్లో భారత ఎగుమతుల వాటా కేవలం 2 నుంచి 2.5 శాతానికే పరిమితం కావడంపై దృష్టి సారించాలని, గ్లోబల్ డిమాండ్‌కు అనుగుణంగా ఫుడ్ ప్రాసెసింగ్, విలువ ఆధారిత రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామిక వర్గాలకు సూచించారు.

మొదటి భర్త కుటుంబ ఆస్తిలో రెండో వివాహం పిల్లలకు వాటా

మొదటిపేజీ తరువాయి - ఆమె రెండో వివాహం ద్వారా జన్మించిన పిల్లలు కూడా ఆ ఆస్తిని వారసత్వంగా పొందేందుకు అర్హులని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఢిల్లీలోని వ్యవసాయ భూమి వారసత్వానికి సంబంధించిన వివాదంలో మొదటి భర్త కుటుంబీకుల వాదనను తోసిపుచ్చుతూ, మహిళ రెండో పెళ్లి కుమారులకు అనుకూలంగా అత్యున్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఈ వివాదం వివరాల్లోకి వెళితే... ఖజానో అనే మహిళకు మొదటి భర్త మౌజీ రామ్, కుమారుడు రామ్ చందర్ మరణానంతరం సుమారు 45 బిగాల వ్యవసాయ భూమి లభించింది. ఆ తర్వాత ఆమె బాల్‌కిషన్‌ను రెండో వివాహం చేసుకోగా... చంద్ రామ్, చందర్ భాన్ జన్మించారు. ఖజానో మరణం తర్వాత మొదటి భర్త కుటుంబీకులు ఆ భూమి తమ పూర్వీకులదని వాదించగా, రెండో పెళ్లి ద్వారా పుట్టిన కుమారులు వారసత్వ హక్కును కోరారు. సుల్తాన్ సింగ్ వర్సెస్ ఫైనాన్షియల్ కమిషనర్ కేసులో న్యాయస్థానం ఈ అంశాన్ని లోతుగా పరిశీలించింది. హిందూ వారసత్వ చట్టం 1956 అమల్లోకి రాకముందే ఖజానో ఆ భూమిని అనుభవిస్తున్నారని, సెక్షన్ 14(1) ప్రకారం ఆమెకున్న పరిమిత హక్కులు కాస్తా సంపూర్ణ యాజమాన్య హక్కులుగా మారాయని కోర్టు పేర్కొంది. దీంతో ఆమె ఆ ఆస్తికి తాత్కాలిక సంరక్షకురాలిగా కాకుండా పూర్తి స్థాయి స్వతంత్ర యజమానిగా గుర్తింపు పొందారని వివరించింది. ఢిల్లీ భూ సంస్కరణల చట్టం 1954 నిబంధనల ప్రకారం ఆమె మరణించే నాటికి ఉన్న వ్యక్తిగత చట్టాల ఆధారంగా చట్టబద్ధ వారసులైన చంద్ రామ్, చందర్ భాన్‌లకే ఆ భూమి దక్కుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒక ఆస్తి ఎక్కడి నుంచి వచ్చిందనే మూలాల కంటే, సదరు మహిళ మరణించే సమయానికి ఆ ఆస్తిపై ఆమెకున్న హక్కు స్వభావమే ప్రధానమని న్యాయస్థానం తేల్చిచెప్పింది.

TG/TEL/25/A3731
నిజం
దృష్టి తెలుగు న్యూస్
శుక్రవారం 20-11-2026

నేడు చందానగర్, అమీన్‌పూర్‌లో సీసీ కెమెరాల ప్రారంభోత్సవం

ప్రారంభించనున్న సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఐపీఎస్



హైదరాబాద్ నవంబర్ 19 నిజం న్యూస్ చందానగర్: ప్రజల భద్రత, నేరాల నియంత్రణ లక్ష్యంగా చందానగర్, అమీన్‌పూర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను నేడు (నవంబర్ 19) సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఐపీఎస్ ప్రారంభించనున్నారు. సాయంత్రం 6 గంటలకు చందానగర్ పైప్‌లైన్ రోడ్డులో, గీతా థియేటర్ పక్కన ఉన్న శ్రీ సప్తపది క్రిస్టల్ గార్డెన్‌లో మొదటి కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం రాత్రి 7 గంటలకు అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో మరో కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమాల ద్వారా స్థానిక ప్రాంతాల్లో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజల భద్రతకు ప్రాధాన్యత కల్పించనున్నారు.

నిజాంపేటలో కల్తీ మద్యం దందా గుట్టురట్టు!

బ్రాండెడ్ మద్యం బాటిళ్లలో నీరు, చీప్ లిక్కర్ కలిపి విక్రయాలు

528 మద్యం బాటిళ్లు, 28 లీటర్ల గుర్తుతెలియని మద్యం స్వాధీనం.. లిక్కర్ మార్ట్ సీజ్, నిర్వాహకుడి అరెస్ట్



హైదరాబాద్ నవంబర్ 19 నిజం న్యూస్: బ్రాండెడ్ మద్యం పేరుతో కల్తీ మద్యం విక్రయిస్తున్న వ్యవహారం నిజాంపేటలో వెలుగుచూసింది. ప్రీమియం, మీడియం రకం మద్యం బాటిళ్లలో అసలు మద్యాన్ని కొంతమేర తొలగించి, ఆ స్థానంలో నీరు, తక్కువ ధర కలిగిన మద్యాన్ని కలిపి విక్రయిస్తున్నట్లు ఎక్సైజ్ డీటీఎఫ్ అధికారులు గుర్తించారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిజాంపేటలోని ఓజీ లిక్కర్ మార్ట్‌పై అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి అక్రమ వ్యాపారాన్ని గుర్తించారు. అధికారుల తనిఖీల్లో లిక్కర్ మార్ట్ నిర్వాహకుడు గంధం ప్రవీణ్ గౌడ్ వివిధ బ్రాండ్ల మద్యం బాటిళ్ల మూతలు తెరిచి, అందులోని మద్యాన్ని కొంతమేర తొలగించి నీరు లేదా తక్కువ ధర కలిగిన మద్యాన్ని కలిపి తిరిగి విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు సమాచారం. 100 పైపర్స్, బ్లెండర్స్ ప్రైడ్, ఐకానిక్, స్టెర్లింగ్ బీ7, రాయల్ ఛాలెంజ్ తదితర బ్రాండ్ల మద్యం బాటిళ్లలో కల్తీ జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఈ దాడుల్లో 180 ఎంఎల్ సామర్థ్యం కలిగిన 528 మద్యం బాటిళ్లతో పాటు వివిధ బ్రాండ్లకు చెందిన 28 లీటర్ల గుర్తుతెలియని మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కల్తీకి ఉపయోగించినట్లు అనుమానిస్తున్న ఇతర మద్యం బాటిళ్లు, నమూనాలను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో లిక్కర్ మార్ట్ నిర్వాహకుడు గంధం ప్రవీణ్ గౌడ్‌ను అరెస్ట్ చేసి, స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, నమూనాలు, సంబంధిత పత్రాలను తదుపరి విచారణ నిమిత్తం నిజాంపేట ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. సంబంధిత లిక్కర్ మార్ట్‌ను అధికారులు సీజ్ చేశారు. బ్రాండెడ్ మద్యం పేరుతో కల్తీకి పాల్పడిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ అక్రమ వ్యాపారం ఎంతకాలంగా కొనసాగుతోంది? కల్తీ మద్యం ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారు? ఈ వ్యవహారంలో మరెవరైనా భాగస్వాములుగా ఉన్నారా? అనే కోణాల్లో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ 109వ జయంతి వేడుకలు

దేశాభివృద్ధికి ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయం



హైదరాబాద్ నవంబర్ 19 నిజం న్యూస్‌కూకట్‌పల్లి: భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి, ఉక్కు మహిళ, దివంగత నాయకురాలు శ్రీమతి ఇందిరాగాంధీ 109వ జయంతి వేడుకలను బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు పులి శివకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు పాల్గొని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కొండకింది పుష్పారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మదన్ మోహన్, జిల్లా ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ జల్లా శివ, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్రసన్నతో పాటు పలువురు నాయకులు ఇందిరాగాంధీ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భారతదేశ తొలి మహిళా ప్రధానిగా దేశానికి విశేష సేవలందించిన ఇందిరాగాంధీ ధైర్యసాహసాలు, పాలనా దక్షత, ప్రజాసంక్షేమ కార్యక్రమాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. దేశ సమగ్రత, అభివృద్ధి కోసం ఆమె చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యపాల్ రెడ్డి, మధు గౌడ్, మహేందర్, శ్రీకాంత్ గౌడ్, రవి గౌడ్, సదా గౌడ్, రవి ముదిరాజ్, దేవిడ్, మహిళా నాయకులు రేణుక, సాయి భారతి, విజయ, పద్మావతి, ఊర్మిళ, శ్రీమలత, శ్వేత తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

బృందావన్ కాలనీలో సెవెరేజ్ లైన్ పనుల పరిశీలన

పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి: మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు





హైదరాబాద్ నవంబర్ 19 నిజం న్యూస్: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో నూతనంగా చేపట్టనున్న సెవెరేజ్ లైన్ పనులను డివిజన్ మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను త్వరితగతిన పూర్తి చేసి కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా నార్నె శ్రీనివాసరావు మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ప్రజల నుంచి అందిన వినతులు, తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణనలోకి తీసుకుని అత్యవసర పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. నిత్యం సమస్యలు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో అభివృద్ధి పనులను ముందుగా చేపట్టి పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యమన్నారు. ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కారానికి కృషి చేస్తానని, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సహకారంతో హైదర్‌నగర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని నార్నె శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ విలియం ప్రకాష్, సూపర్‌వైజర్ నరేంద్ర, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ముద్ర లోన్ పేరుతో సైబర్ మోసం

వ్యాపారికి రూ.4.67 లక్షలు టోకరా.. నలుగురు నిందితుల అరెస్ట్



హైదరాబాద్ నవంబర్ 19 నిజం న్యూస్ హైదరాబాద్: ముద్ర లోన్ ఇప్పిస్తామంటూ ఓ వ్యాపారిని నమ్మించిన సైబర్ నేరగాళ్లు రూ.4.67 లక్షలు కాజేశారు. మల్కాజ్‌గిరి పరిధిలో వెలుగుచూసిన ఈ ఘటనలో నలుగురు నిందితులను సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉండటంతో వారి కోసం గాలిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన 46 ఏళ్ల వ్యాపారికి ఫేస్‌బుక్‌లో ముద్ర రుణానికి సంబంధించిన ప్రకటన కనిపించింది. దాన్ని నమ్మి సంప్రదించగా, తాము ముద్ర ఫైనాన్స్ ప్రతినిధులమని పరిచయం చేసుకున్న నిందితులు రూ.11.5 లక్షల రుణం మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రాసెసింగ్ ఛార్జీలు, టీడీఎస్, ఆర్బీఐ కంప్లయన్స్ ఫీజుల పేరుతో విడతల వారీగా బాధితుడి నుంచి రూ.4,67,800 వసూలు చేశారు. అయినప్పటికీ రుణం మంజూరు కాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నలుగురు నిందితులను అరెస్ట్ చేయగా, పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలింపు కొనసాగిస్తున్నారు.

కూకట్‌పల్లిలో ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

దేశ సమగ్రత, పేద ప్రజల సంక్షేమానికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయం: బండి రమేష్





హైదరాబాద్ నవంబర్ 19 నిజం న్యూస్ కూకట్‌పల్లి: భారత మాజీ ప్రధాని, భారతరత్న, ఉక్కు మహిళ స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి వేడుకలను కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ఇందిరాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అల్లాపూర్ డివిజన్‌లో డివిజన్ అధ్యక్షుడు వాజిద్ పాషా ఆధ్వర్యంలో, మూసాపేట్ విలేజ్ సమీపంలో డివిజన్ అధ్యక్షుడు సంతోష్ ఆధ్వర్యంలో, ఐజీ పురంలో అజీజ్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రిగా ఇందిరాగాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశ సమగ్రత, సమైక్యత, పేద ప్రజల సంక్షేమం కోసం ఆమె తీసుకున్న నిర్ణయాలు భారత చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయని అన్నారు. బ్యాంకుల జాతీయీకరణ, పేదరిక నిర్మూలన వంటి కార్యక్రమాల ద్వారా దేశ అభివృద్ధికి ఆమె చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని తెలిపారు. ఇందిరాగాంధీ ఆశయాలు, ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని కాంగ్రెస్ పార్టీ ప్రజాసేవలో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, యువజన నాయకులు, మహిళా నాయకురాళ్లు, పార్టీ కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు విశేష కృషి చేసిన నాయకురాలు ఇందిరాగాంధీ

దేశాభివృద్ధిలో ఆమె సేవలు చిరస్మరణీయం.. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. జగదీశ్వర్ గౌడ్





హైదరాబాద్ నవంబర్ 19 నిజం న్యూస్: భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి, ఉక్కు మహిళగా పేరుగాంచిన స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి వేడుకలను శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాదాపూర్ డివిజన్ పరిధిలోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి. జగదీశ్వర్ గౌడ్ పాల్గొని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా మహిళా సాధికారత కోసం విశేషంగా కృషి చేసిన గొప్ప నాయకురాలు ఇందిరాగాంధీ అని కొనియాడారు. దేశవ్యాప్తంగా ఆమె అందించిన సేవలు చిరస్మరణీయమని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆమె పాలనలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలయ్యాయని పేర్కొన్నారు. తెలంగాణలోని మారుమూల గ్రామాల్లో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి నిలువ నీడ కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం కొనసాగుతోందని తెలిపారు. ఇందిరాగాంధీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సంక్షేమం, మహిళా సాధికారత, పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర లేబర్ సెల్ ఉపాధ్యక్షులు నల్ల సంజీవ రెడ్డి, నియోజకవర్గ నాయకులు సయ్యద్ గౌస్, వీరేందర్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, కనకమామిడి నరేందర్ గౌడ్, సేవాదళ్ అధ్యక్షులు నర్సింగ్ రావు, గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షులు భరత్ గౌడ్, మాదాపూర్ డివిజన్ అధ్యక్షులు నగేష్ నాయక్, మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్పన ఏకాంత్ గౌడ్, ఇతర కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ మీడియా చైర్మన్‌గా చాకలి శైలేందర్

నియామక ఉత్తర్వులు జారీ చేసిన ఆల్ ఇండియా కాంగ్రెస్ సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్ శ్రీనివాస్ బి.వి.



హైదరాబాద్ నవంబర్ 19 నిజం న్యూస్ హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ మీడియా చైర్మన్‌గా పార్టీ సీనియర్ నాయకుడు చాకలి శైలేందర్ నియమితులయ్యారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని ఆల్ ఇండియా కాంగ్రెస్ సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్ శ్రీనివాస్ బి.వి. గురువారం అధికారిక ప్రకటనలో వెల్లడించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతానికి, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాల నిర్వహణకు చాకలి శైలేందర్ అందిస్తున్న సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన శైలేందర్ ఇండియన్ యూత్ కాంగ్రెస్ (ఐవైసీ) ద్వారా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అంచెలంచెలుగా ఎదుగుతూ పార్టీలో పలు కీలక బాధ్యతలు చేపట్టారు. గతంలో రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్‌లో చురుకైన పాత్ర పోషించడంతో పాటు, రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలోనూ క్రియాశీలకంగా పాల్గొన్నారు. ఓతెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీ అప్పగించిన కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, కాంగ్రెస్ పార్టీ విజయానికి తనవంతు కృషి చేశారు. పార్టీ కోసం ఆయన చేసిన సేవలు, అంకితభావాన్ని గుర్తించిన అధిష్ఠానం ఈ కీలక పదవిని అప్పగించినట్లు శ్రీనివాస్ బి.వి. తెలిపారు.

కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల అమ్మకాన్ని ఆపే వరకు పోరాటం ఆగదు

ప్రజల భవిష్యత్తు కోసం ఈ నెల 22, 23 తేదీల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నిరాహార దీక్ష





హైదరాబాద్ నవంబర్ 19 నిజం న్యూస్ సోమాజిగూడ: కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూములను వేలం వేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని, ప్రజా అవసరాల కోసం కేటాయించిన భూములను కాపాడుకునే వరకు తమ పోరాటం కొనసాగుతుందని వివిధ రాజకీయ పార్టీల నాయకులు స్పష్టం చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) తదితర వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కమిటీ కార్యదర్శి పి. సత్యం అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు హాజరై ట్రక్ పార్క్ భూముల అమ్మకంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గతంలో రైతుల నుంచి సేకరించిన భూములను ప్రజా అవసరాల కోసం కేటాయించారని, ఇప్పుడు వాటిని వేలం వేయడం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డారు. కూకట్‌పల్లి ప్రాంతంలో రోజురోజుకూ జనాభా పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తు తరాలకు అవసరమైన పార్కులు, మౌలిక సదుపాయాలు, ఇతర ప్రజా అవసరాల కోసం ఈ భూములను వినియోగించాలని డిమాండ్ చేశారు. ట్రక్ పార్క్ భూముల విక్రయాన్ని నిలిపివేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఇప్పటికే పలుమార్లు నిరసన కార్యక్రమాలు చేపట్టారని, ప్రజా ప్రయోజనాల కోసం తన పోరాటాన్ని మరింత ఉధృతం చేయనున్నారని నాయకులు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 22, 23 తేదీల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శాంతియుత నిరాహార దీక్ష చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ పోరాటానికి సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా తదితర వామపక్ష పార్టీలు మద్దతు ప్రకటించాయి. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గోవర్ధన్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సదానందం, సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఐలాపురం, రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు శంకర్, సంతోష్, లింగస్వామి, విజయ, సీపీఐ నాయకులు కృష్ణ, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ట్రక్ పార్క్ భూములను ప్రజా అవసరాలకే వినియోగించాలని, ప్రభుత్వం వేలం నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు ఐక్యంగా ఉద్యమిస్తామని నాయకులు స్పష్టం చేశారు.

మియాపూర్ సర్వే నంబర్ 100 భూముల వివాదంపై కాలనీవాసులకు గాంధీ భరోసా

సమస్యను సీఎం, రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకెళ్తా.. ఎవరూ ఆందోళన చెందవద్దు

హైదరాబాద్ నవంబర్ 19 నిజం న్యూస్: మియాపూర్ మియాపూర్ సర్వే నంబర్ 100 భూములకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రశాంత్ నగర్, ఎంఏ నగర్, స్టాలిన్ నగర్ కాలనీల్లో నివసిస్తున్న ప్రజల్లో నెలకొన్న ఆందోళనను దృష్టిలో ఉంచుకుని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ ఆయా కాలనీల్లో పర్యటించి, కాలనీవాసులతో సమావేశమయ్యారు. తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. తాము ఎన్నో ఏళ్లుగా ఆయా కాలనీల్లో నివసిస్తున్నామని, సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో తీవ్ర ఆందోళనకు గురవుతున్నామని తెలిపారు. తమ సమస్యను మానవతా దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని గాంధీని కోరారు. ఆయన హయాంలో కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించి ఆదర్శవంతమైన కాలనీలుగా అభివృద్ధి చేశారని కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గాంధీ మాట్లాడుతూ.. న్యాయస్థానం ఇచ్చిన తీర్పును గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అయితే ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న అమాయక కుటుంబాలకు న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీవాసుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్‌తో పాటు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఎవరూ ఆందోళన చెందవద్దని, అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజల్లో అపోహలు, గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తారని, అలాంటి వదంతులను నమ్మవద్దని సూచించారు. ప్రశాంత్ నగర్, ఎంఏ నగర్, స్టాలిన్ నగర్, పీఏ నగర్ కాలనీల్లో ఇప్పటికే రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేశామని గాంధీ పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్ష



హైదరాబాద్ నవంబర్ 19 నిజం న్యూస్ కుత్బుల్లాపూర్: నియోజకవర్గ పరిధిలోని గాజులరామారం డివిజన్ ఉషోదయ కాలనీతో పాటు సుభాష్ నగర్ డివిజన్ ఎస్.ఆర్. నాయక్ నగర్‌లో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. స్వామివారి కృప ప్రతి ఒక్కరిపై ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమాల్లో పడి పూజ నిర్వాహకులు సురేందర్ రెడ్డి, యేసుబాబు, స్థానిక కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి,

వెంకన్నతో పాటు అయ్యప్ప సేవా సమితి సభ్యులు, అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

83 మంది లబ్ధిదారులకు
రూ.83.09 లక్షల కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా ప్రజా ప్రభుత్వం: పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



హైదరాబాద్ నవంబర్ 19 నిజం న్యూస్ కూకట్‌పల్లి: పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు నిరుపేద కుటుంబాలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. కూకట్‌పల్లి మండల పరిధిలోని వివేకానంద నగర్, హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీ, వెంకటేశ్వర నగర్ డివిజన్లకు చెందిన 83 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.83,09,628 విలువైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను వివేకానంద నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో గాంధీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. 83 మంది లబ్ధిదారులకు రూ.83.09 లక్షల ఆర్థిక సహాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతిగా నిలుస్తూ, ఆడబిడ్డల వివాహాలకు పెద్దన్నగా అండగా ఉంటున్నారని కొనియాడారు. నిరుపేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలు ఆర్థిక ఇబ్బందులు లేకుండా సంతోషంగా జరగాలనే సదుద్దేశంతో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, లబ్ధిదారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలు



ఉమ్మడి నల్లగొండ జిల్లా నిజం న్యూస్ నవంబర్ 19: రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ భారత ఉక్కు మహిళగా ప్రసిద్ధిగాంచిన ఇందిరాగాంధీ ప్రధాన మంత్రిగా ఆమె చేసిన సేవల్ని కొనియాడారు. నెహ్రూ తర్వాత అంతటి సుదీర్ఘకాలం ప్రధానిగా దేశానికి చేసిన సేవలు గణనీయమైనవని ప్రశంసించారు. భారతదేశాన్ని అన్నిరంగాలలో రాణించేలాగా వారు గావించిన కృషి చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. చరిత్ర విభాగాధిపతి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ డి. కిషన్ మాట్లాడుతూ దేశంలో పలు సంస్కరణలు చేపట్టడంలో ఇందిరా గాంధీ కీలక పాత్ర పోషించారని, బ్యాంకులను జాతీయం చేయడం, రాజభరణాల రద్దు వంటి సాహసోపేతమైన సంస్కరణలను తీసుకురావడం గొప్ప విషయమని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే జాతీయ సమైక్యతా ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జె. చిన్నబాబు, డాక్టర్ జి. సునీత, వైస్ ప్రిన్సిపల్ ఆచార్య ఆర్. రత్న మంజుల, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.లక్ష్మి నీలిమతో పాటు అధ్యాపకుల, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం... దేశ ఐక్యతకు ఆమె కృషి స్ఫూర్తిదాయకం

కూకట్‌పల్లి బస్టాండ్ వద్ద ఘనంగా మాజీ ప్రధాని 109వ జయంతి వేడుకలు



నిజం న్యూస్ కూకట్‌పల్లి ప్రతినిధి , నవంబర్ 19,2026: కూకట్‌పల్లి బస్ స్టాప్ వద్ద, కూకట్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కావేటి నాగార్జున ఆధ్వర్యంలో భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ 109వ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బస్ స్టాప్ వద్ద ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు. తదుపరి సమీపంలోని పాఠశాలలో చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేసి వారి ఆనందంలో భాగస్వాములయ్యారు. అనంతరం జిహెచ్ఎంసి పారిశుద్ధ్య కార్మికులకు కూడా మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ దేశం కోసం చేసిన విశేష సేవలను, ధైర్యసాహసాలను, దేశ ఐక్యత మరియు సమగ్రత కోసం ఆమె అందించిన కృషిని స్మరించుకున్నారు. దేశ అభివృద్ధి కోసం ఆమె తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలు, ప్రజాసేవ పట్ల ఆమెకున్న నిబద్ధత నేటి తరానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టముక్కల వెంకటేశ్వరరావు (జీవీర్) గొట్టముక్కల జశ్వంత్ రావు గూడెపు నాగరాజు, జ్యోతి కృష్ణవేణి గండి మల్లేష్ మేకల మహేష్ కొమ్ము బబ్బు, రాజు సతీష్, వినయ్ గౌడ్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఘనంగా నిర్వహణ

మెదక్ జిల్లా ప్రతినిధి విఠల్ గౌడ్ నవంబర్ 19,: మెదక్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం రోజున మెదక్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి 14, 17 సంవత్సరాల లోపు బాలబాలికల కబడ్డీ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల నుంచి 72 మంది బాలికలు, 72 మంది బాలురు పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటుకున్నారు.ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఆర్. నాగరాజు మాట్లాడుతూ.. ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలికల కబడ్డీ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు పాల్గొననున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పీఈటీఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. నాగరాజు, పీఈటీఏ జిల్లా కార్యదర్శి మధుసూదన్, పీడీలు మాధవరెడ్డి, శ్రీధర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, రమేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శత్రువు వెన్నులో వణుకుపుట్టించేలా.. 850 కామికేజ్ డ్రోన్లను కొనుగోలు చేయనున్న భారత్! వీటి ప్రత్యేకత ఇదే..



ఆపరేషన్ సిందూర్ నుండి నేర్చుకున్న పాఠాలతో, భారత సైన్యం 850 ఆత్మాహుతి (లూటరింగ్ అటాక్) డ్రోన్‌లను కొనుగోలు చేయనుంది. ఈ డ్రోన్‌లు త్రివిధ దళాలను, ప్రత్యేక దళాలను బలోపేతం చేస్తాయి. భవిష్యత్తులో 30,000 డ్రోన్‌లను ప్రవేశపెట్టాలని సైన్యం యోచిస్తోంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. ఆపరేషన్ సిందూర్ నుండి నేర్చుకున్న పాఠాలను ఆధారంగా చేసుకుని, భారత సైన్యం 850 ఆత్మాహుతి డ్రోన్‌లను కొనుగోలు చేయడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ డ్రోన్‌లను త్రివిధ రక్షణ దళాలు, ప్రత్యేక దళాలను బలోపేతం చేయడానికి ఉపయోగించనున్నారు. భారత సైన్యం ప్రతిపాదన సేకరణ చివరి దశలో ఉంది. ఈ నెల చివరి వారంలో జరగనున్న డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ ఉన్నత స్థాయి సమావేశంలో దీనికి ఆమోదం లభించే అవకాశం ఉందని సమాచారం. ఈ ప్రతిపాదన కింద దేశీయంగా అభివృద్ధి చేయబడిన లాంచర్లతో కూడిన సుమారు 850 లూటరింగ్ అటాక్ డ్రోన్‌లను సైన్యానికి అందించనున్నారు. భారత సైన్యం ఇప్పటికే వివిధ వనరుల నుండి సేకరించిన ఇటువంటి డ్రోన్‌లను పెద్ద సంఖ్యలో ఉపయోగిస్తుందని, ఇప్పుడు భవిష్యత్తులో దాని అన్ని పోరాట విభాగాలను సన్నద్ధం చేయడానికి సుమారు 30,000 డ్రోన్‌లను ప్రవేశపెట్టాలని భావిస్తోంది. సైన్యంలోని ప్రతి పదాతిదళ బెటాలియన్‌లో ఇప్పుడు ఒక అశ్విని ప్లాటూన్ ఉంటుంది. ఈ ప్లాటూన్ శత్రు స్థానాలపై దాడి చేయడానికి, ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలలో ఉపయోగించే డ్రోన్‌లను నిర్వహించడానికి బాధ్యత వహిస్తుంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకోవడానికి భారత సైన్యం విస్తృతంగా డ్రోన్‌లను ఉపయోగించింది. ఆపరేషన్ మొదటి రోజున భారత్ తొమ్మిది ఉగ్రవాద స్థావరాలలో ఏడింటిని నాశనం చేసింది. 26 మంది ప్రాణాలను బలిగొన్న పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతిస్పందనగా ఈ చర్య జరిగిన విషయం తెలిసిందే.

రైల్వే ప్రయాణికులకు గుడ్‌న్యూస్..!
ఆ విషయం 10 గంటల ముందే తెలుస్తుంది.. రైల్వే శాఖ అధికారిక ప్రకటన



రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న రైలు టిక్కెట్ల ధృవీకరణ వివరాలు, తొలి రిజర్వేషన్ చార్ట్ రైలు బయల్దేరడానికి 10 గంటల ముందే విడుదల అవుతుంది. ప్రయాణికులు చివరి నిమిషంలో ఆందోళన చెందకుండా, తమ సీటు లేదా బెర్త్ ఖరారైందా లేదా అని ముందుగానే తెలుస్తుంది. ఎక్కడికైనా దూర ప్రాంతాలకు ప్రయాణించాలంటే చాలా మంది చేసే పని రైలు టిక్కెట్లు బుక్ చేసుకోవడం. కొంతమంది రెండు మూడు రోజుల ముందే టిక్కెట్లు బుక్ చేసుకుంటూ ఉంటారు. అయితే అప్పటికే ఆ రైలు టిక్కెట్లు అయిపోయి ఉంటే, వెయిటింగ్ లిస్ట్‌లో ఉంటారు. అలా వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నవారికి సీట్లు బుక్ అయ్యాయా లేదా అనేది రైలు బయలుదేరే సమయానికంటే 10 గంటల ముందే తెలిసిపోతుంది. ప్రయాణికుల రిజర్వేషన్ వివరాలతో కూడిన తొలి జాబితాలను రైలు బయల్దేరే సమయానికంటే 10 గంటల ముందే సిద్ధం చేయాలని రైల్వేశాఖ నిర్ణయించింది. దీనికి సంబంధించిన రైల్వే శాఖ అధికారిక ప్రకటన విడుదల చేసింది. దూర ప్రాంతాల నుంచి వేరే స్టేషన్లకు వెళ్లి రైలును అందుకోవాల్సినవారికి తమ బెర్తు, సీటు ఖాయమైందో లేదో స్పష్టంగా తెలిస్తే చివరిక్షణంలో హైరానా పడాల్సిన పనిలేకుండా రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. తెల్లవారుజామున 5.01 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య బయల్దేరే రైళ్లకు తొలి చార్టును ముందురోజు రాత్రే రూపొందిస్తారు. మధ్యాహ్నం 2.01 గంటల నుంచి రాత్రి 11.59 గంటల వరకు, అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల మధ్య బయల్దేరే రైళ్ల తొలిచార్టును ఇదే విధంగా తగినంత ముందుగా రెడీ చేస్తారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని అన్ని జోనల్ కార్యాలయాలకు రైల్వే మంత్రిత్వశాఖ ఆదేశాలిచ్చింది.

ఆర్‌బీఐ మరో బిగ్ డెసిషన్.. ఈఎంఐలు, లోన్లు, క్రెడిట్ కార్డులకు కొత్త రూల్స్..



ఆర్‌బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. సిబిల్ స్కోర్ రిపోర్టింగ్ విషయంలో పలు మార్పులు చేసింది. రుణాలు, క్రెడిట్ కార్డుల మంజూరుకు సిబిల్ స్కోర్ ఎంత ముఖ్యమనేది మనందరికీ తెలిసిందే. మినిమం 700 సిబిల్ స్కోర్ లేకపోతే మీకు లోన్లు, క్రెడిట్ కార్డులు రావు. క్రెడిట్ స్కోర్ ఆర్థికపరంగా ఎంత ముఖ్యమనేది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మీరు ఫైనాన్షియల్‌గా ఎలా ఉన్నారనేది మీ క్రెడిట్ రిపోర్టును చూస్తే తెలిపిపోతుంది. మీ ఆర్థిక పరిస్థితిని క్రెడిట్ రిపోర్టుతో ఎవరైనా అంచనా వేయవచ్చు. లోన్లు, క్రెడిట్ కార్డు పొందాలనుకునేవారికి సిబిల్ స్కోర్ అనేది అత్యంత ముఖ్యం. ఇప్పుడు క్రెడిట్ రిపోర్ట్‌కు సంబంధించి ఆర్‌బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి వారానికి ఒకసారి బ్యాంకులు, ఎన్‌ఎఫ్‌బీసీ సంస్థలు క్రెడిట్ రిపోర్ట్ డేటాను సిబిల్ బ్యూరోకు అందించాల్సి ఉంటుంది. గతంలో ఉన్న నిబంధనల్లో ఇప్పుడు మార్పులు చేసింది. కొత్త నిబంధనలు వచ్చే ఏడాది జులై 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

ఒక నెల నుంచి వారం వరకు..

గతంలో నెలకు ఒకసారి బ్యాంకులు, ఫైనాన్షియల్ సంస్థలు నెలకు ఒకసారి మాత్రమే కస్టమర్ల క్రెడిట్ రిపోర్టును అప్డేడ్ చేసి బ్యూరోకు పంపించాల్సి ఉండేది. కానీ ఈ ఏడాది జనవరి 1 నుంచి దానిని 15 రోజులకు మార్చారు. 15 రోజులకు ఒకసారి క్రెడిట్ రిపోర్ట్ అప్డేట్ చేసేలా ఆర్బీఐ ఆదేశాలిచ్చింది. ఇక వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి వారానికి ఒకసారి డేటాను ఇవ్వాల్సి ఉంటుంది. దీని వల్ల మోసాల గుర్తింపును మెరుగుపర్చడం, వినియోగదారులకు ఖచ్చితమైన సమాచారం అందుతుందని ఆర్బీఐ స్పష్టం చేసింది. తాజాగా విడుదల చేసిన క్రెడిట్ ఇన్ఫర్మేషన్ రిపోర్టింగ్ డైరెక్షన్స్,2025 మసాయిదా సవరణలో ఈ మార్పులను ఆర్బీఐ విడుదల చేసింది.

వారం రోజుల్లోనే పెరుగుదల

గతంలో మీరు లోన్‌కు సంబంధించి పెద్ద మొత్తంలో ముందస్తుగా చెల్లించినా లేదా క్రెడిట్ కార్డు బిల్లును ముందుగా క్లియర్ చేసినా సిబిల్ స్కోర్‌లో అప్డేట్ కావడానికి చాలా టైమ్ పట్టేది. అప్డేట్ అవ్వడానికి 30 నుంచి 40 రోజులు పట్టేది. ప్రస్తుతం అమల్లో ఉన్న 15 రోజులు పీరియడ్ వల్ల కూడా టైమ్ పడుతుంది. కానీ వారంలోనే అప్డేట్ అవ్వడం వల్ల మీ సిబిల్ అప్‌డేట్ అవ్వడానికి ఎక్కువ సమయం పట్టదు. మీరు ముందుగానే బిల్లు చెల్లిస్తే మీ సిబిల్ స్కోర్ వెంటనే అప్‌డేట్ అవుతుంది. ఇక మీ క్రెడిట్ స్కోర్ ఆధారంగా బ్యాంకులు ప్రీ-అప్రూవ్డ్ పర్సనల్ లోన్‌లు, టాప్-అప్‌లు లేదా క్రెడిట్ కార్డ్‌లను ఆఫర్ చేస్తూ ఉంటాయి. మీ సిబిల్ స్కోర్ త్వరగా అప్డేట్ వల్ల మీకు లోన్లు త్వరగా మంజూరయ్యే అవకాశాలు ఉంటాయి. అంతేకాకుండా తక్కువ వడ్డీకే మీకు లోన్లు లభించే అవకాశం ఉంటుంది.

ఎస్ఎన్ఎల్ నుంచి మార్కెట్‌ను షేక్ చేసే చీపెస్ట్ రీఛార్జ్ ప్లాన్.. రోజుకు రూ.5తో అన్నీ ఫ్రీ..



త్వరలో క్రిస్మస్, న్యూఇయర్ లాంటి వరుస పండుగలు వస్తున్న క్రమంలో టెలికాం కంపెనీలు ప్రత్యేక ఆఫర్లను ప్రకటిస్తున్నాయి. రీఛార్జ్ ఆఫర్లు, డిస్కౌంట్లను మొబైల్ వినియోగదారుల కోసం తీసుకొస్తున్నాయి. ప్రైవేట్ కంపెనీలకు పోటీగా ప్రభుత్వ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ కూడా ప్రత్యేక ఆఫర్లను తీసుకొస్తుంది. కొత్త ఏడాది వచ్చేస్తోంది. చాలా వస్తువుల ధరలు మారనున్నాయ్. కొన్ని వస్తువుల ధరలు పెరగనుండటంతో ప్రజలపై అదనపు భారం పడనుంది. రూపాయి పతనంతో మొబైల్ ధరలు వచ్చే ఏడాది పెరగనుండగా.. రీఛార్జ్ ధరలను కూడా భారీగా పెంచేందుకు టెలికాం కంపెనీలు రెడీ అవుతున్నాయి. దీంతో మొబైల్ మెయింటెనెన్స్ మరింత పెరగనుంది. ప్రైవేట్ కంపెనీలు రీఛార్జ్ ధరల పెంపుకు రంగం సిద్ధం చేసుకుంటున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వ టెలికాం రంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ కస్టమర్లకు ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగా తక్కువ ధరకు రీఛార్జ్ ప్లాన్స్‌ను తెస్తోంది. బీఎస్ఎన్ఎల్ ప్రవేశపెట్టిన మరో చవకైన ఓ ప్లాన్ గురించి తెలుసుకుందాం.

రోజుకు రూ.5తో చౌకైన ప్లాన్

బీఎస్ఎన్ఎల్ కొత్తగా రూ.347 ప్లాన్ తీసుకొచ్చింది. 50 రోజుల వ్యాలిడిటీతో కూడిన ఈ ప్లాన్‌లో ఆన్ లిమిటెడ్ కాల్స్ చేసుకోవచ్చు. ఇక రోజుకు 2జీబీ హైస్పీడ్ డేటాతో పాటు 100 ఎస్ఎంఎస్‌లు పంపుకునే సౌకర్యం ఉంది. అంటే రోజుకు రూ.5 కంటే తక్కువ ధరతో మీకు ఈ ప్లాన్ లభిస్తుంది. ప్రైవేట్ కంపెనీల రీఛార్జ్ ధరలు పెరుగుతున్న క్రమంలో వినియోగదారుల ఖర్చులు తగ్గించేందుకు బీఎస్ఎన్ఎల్ ఈ ప్లాన్ తీసుకొచ్చింది. ప్రైవేట్ టెలికాం కంపెనీలలో 50 రోజుల ప్లాన్ అంటే రూ.500 వరకు రీఛార్జ్ ఉంటుంది. కానీ అదే బీఎస్ఎన్ఎల్ రూ.150 తక్కువ ధరలో అందిస్తుంది. ఇక త్వరలో క్రిస్మస్ వస్తున్న క్రమంలో మరో ప్రత్యేక ప్లాన్ విడుదలకు బీఎస్ఎన్ఎల్ రెడీ అవుతోంది.

త్వరలో బీఎస్ఎన్ఎల్ 5జీ

కొత్త ఏడాదిలో దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ 5జీ సర్వీసులను ప్రారంభించనుంది. ఇటీవలే లక్ష స్వదేశీ 4జీ మొబైల్ టవర్లను ఏర్పాటు చేసి ఓ మైలురాయి సాధించింది. వీటినే 5జీకే మార్చనున్నారు. వచ్చే ఏడాది ప్రారభంలోనే ఢిల్లీ, ముంబై వంటి ప్రధాన కేంద్రాల్లో 5జీ సర్వీసులను ప్రారంభించనుంది.

Ho no:LIG-32,, Ph No:- 9247842354, 9059207979,near water tank, Bharat Nagar colony, moos-apet, Hyderabad, pin code 500018.